

మధు పిక్చర్స్ 1969

మంచి మిత్రులు

నిర్మాత: పి. మల్లిఖార్జునరావు దర్శకుడు: టి. రామారావు

మధు పిక్చర్స్

"మంచి మిత్రులు"

కథా సంగ్రహం

జీవితంలో ఎన్ని ఒడుదుడుకులు వచ్చినా ముక్కుకిసూటిగా పోవాలనే మనస్తత్వం కలవాడు గోపీ. కాని— సీను మనస్తత్వం పూర్తిగా విరుద్ధం. సమయానుకూలంగా సద్దుకుపోతారు. అయినా యిద్దరూ ప్రాణ స్నేహితులు, సీను వుద్యోగం దొరకక బాధ పడుతుంటే, గోపీ, ముక్కుకు సూటిగపోయి వున్న వుద్యోగంకాస్తా ఊడగొట్టుకుని వస్తాడు. పైగా, అద్దె కట్టమని నిష్ఠూరంగా అడిగిన ఇంటి యజమాని మీద విరుచుకుపడతాడు. సీను గోపీని మందలిస్తాడు. గోపీ మండి పడతాడు, ఇద్దరి మధ్యా మాటలు రేగుతాయి. కోపం పట్టలేని గోపీ, ఎవరు గొప్పవాళ్లో పందెంకాసి, తేల్చుకుందాం అంటాడు. చివరకి సీను కూడా అంగీకరిస్తాడు - ఇద్దరూ ఆప్యాయంగా కౌగలించు కుంటారు. పట్టుదలతో దూరమౌతారు.

ఎన్ని ఊళ్ళుతిరిగినా ఎంత అవస్థపడినా ఉద్యోగం అనేది దొరకదు గోపీకి - సీను మాత్రం ఒక పట్టణంచేరి, వుద్యోగం రాకపోయినా ఇందిర అనే అమ్మాయి హృదయాన్ని సంపాదించి, వాళ్ళింట్లో అవుట్ హవుస్‌లో మకాం పెడతాడు. మెల్లిగా వుద్యోగం కూడా సంపాదిస్తాడు. ఇందిర తల్లి పార్వతమ్మకు కళ్లు కనపడవు. పార్వతమ్మ గోపీ తల్లేనని సీనుకు తెలియదు.

సంఘం చేతుల్లో అనుమానాలూ, అవమానాలు సహించి, సహించి చివరికి నిరాశకీ, నిస్పృహకీ లొంగిపోయిన గోపీ, పశుపతి చేతుల్లోపడి దొంగగా మారిపోతాడు. ఒక బ్యాంకు దోచుకుని పారిపోతున్న గోపీ కారుకింద ప్రమాదవశాత్తు పడి పార్వతమ్మ తన ప్రాణాలు కోల్పోతుంది.

గోపీ హృదయం కఠిన శిలగా మారిపోతుంది. క్రమేపీ, ఆ ప్రాంతాన్నే గడగడలాడించే 'గజదొంగ గంగారాం'గా మారిపోతాడు.

సీనును ప్రేమించిన ఇందిర అతనిపేరును 'వాసుగా' మార్చేస్తుంది. వాసు పోలీసు ఆఫీసర్ ఉద్యోగానికి సెలెక్టు అవుతాడు.

ట్రైనింగ్ అయి వచ్చాక గజదొంగ గంగారాంని పట్టుకోడానికి వాసుని స్పెషల్ సి. ఐ. డి. ఆఫీసరుగా నియమిస్తారు.

గజదొంగ గంగారాంని పట్టుకోడానికి కృతనిశ్చయుడై వాసు బయల్దేరతాడు — తనని పట్టుకోడానికి వస్తున్న సి. ఐ. డి. వాసూని హత మార్చడానికి గంగారాం కత్తినూరతాడు.

స్నేహితులిద్దరూ ఏ పరిస్థితుల్లో ఎలా కలుసుకుంటారు ?

వారి పందెం ఏమవుతుంది ?

వాసును ప్రేమించిన గోపీ చెల్లెలు ఇందిరగతి ఏమవుతుంది ?

ఈ చిత్ర విచిత్రమైన ప్రశ్నలకి నవరస భరితమైన సమాధానాలను మా వెండితెరపై చూడండి !





ఇందిర – స్నేహితులు

రచన : సి. నారాయణరెడ్డి పాడినవారు : సుశీల & కోరస్,
బాలసుబ్రహ్మణ్యం.

ఇందిర : నాలుగువైపుల గిరిగీసి
ఆపై సన్నని తెరవేసీ
ఎదురు ఎదురుగా ఆడేఆట
ఎదలు పొంగగా ఎగిరే ఆట –
ఉయ్యాల జంపాలలూగించు సయ్యాట

ఇందిర : లేడికళ్ళు మెరిసిపోగా –
లేతఒళ్ళు అలసిపోగా
నడుములు చేయగ నాట్యాలు
నుదుటను జారగ ముత్యాలు
చిలిపిగ ఆడే లలన ఆట
చెలరేగు పరువాల బులిపించు చెలగాట
॥నాలుగువైపుల॥

సీను : కన్నె వయసే బంత ఆట
కడమ వయసే వింతఆట
ఇపుడు ఆడును చరణాలు
అపుడు ఆడును హృదయాలు

స్నేహితులు: అనుభవసారం చెప్పాడమ్మా
ఘన సన్మానం చెయ్యాలమ్మా

అందరూ : నాలుగువైపుల పెనవేసి
ఆ పై తలపై తెరవేసీ
ఎదురు ఎదురుగా నిలవండమ్మా
తనివి తీరగా కొలవండమ్మా
వచ్చాడు – వచ్చాడు మొనగాడు అమ్మమ్మ.

ఇందిర – సీను

రచన : ఆరుద్ర

పాడినవారు : పి. సుశీల,
బాలసుబ్రహ్మణ్యం

సీను : ఓరచూపులు చూడకముందే
ఒళ్ళు ఎందుకే ఝల్లుమనె
చేతో యిలాగ తాకకముందే
చెక్కిలి ఎందుకే ఎర్రబడె ?
ఇందిర : చేరదీసి చేసే చేతలు
తెలిసిన చెక్కిలి చెమరించె
ఎర్రని పెదిమలు ఎర్రని బుగ్గలు
ఏకం అవునని పులకించె
సీను : పండుగచేసే పరువాలెందుకు
పైటచాటున దాగినవి
ఇందిర : దాగుడుమూతలు ఆడుటవలనే
మూగకోరికలు పెరిగినవి
సీను : నీలోరేగిన చిలిపి వూహలు
నాలో ఎందుకు పొంగినవి.
ఇందిర : నేనూ నువ్వూ ఒకటేకనుక
మేనులుకలసి కరిగినవి ॥ఓరచూపులు॥
ఇందిర : నవనవలాడే నవ్వులు ఏమని
చెవిలో గుసగుసలాడినవి
సీను : ముద్దుల మూటలు కట్టేమదిలో
కొద్దిగ చోటు అడిగినవి
ఇందిర : తామరకన్నులు కోమలి ఆశలు
తనువు నేలపెనవేసినవి
సీను : తనివితీర చెలికాని మోవిపై
తన్మయ మధువులు గ్రోలమని

॥ఓరచూపులు॥





మీ నా

రచన : దాశరథి

పాడినవారు : పి. సుశీల

ఎంతోవున్నది అంతు తెలియనిది
తెలియాలంటే కలుసుకొమ్మన్నది
ముందూ వెనక చూశావంటే
అందం వాడిపోతుంది _
కలలేకంటూ వున్నావంటే
కథయే ముగిసిపోతుంది
అందిన సమయం అరగడియైనా
అందని సుఖములు పొందాలి ॥ఎంతోవున్నది॥

సొగసే వున్న మగువే వుంది
తెగువే నీకు కావాలి
పరుగులు తీసే పరువం వుంది
వలచే తెలివి కావాలి
పగలూ రేయీ పరవశమౌతూ
వలపుల లోతులు చూడాలి ॥ఎంతో వున్నది॥

నర్తకి

రచన : ఆరుద్ర   పాడినవారు : సుశీల

అరె నిషా నిషా మజామజా నీకు కావాలా ?
దిల్ ఖుషీ ఖుషీ పదే పదే తనివి తీరాలా....
వెచ్చని సరసాలు - వీడనిమైకాలు
ఇచ్చే జవరాలు నీకు కావాలా   ॥అరె నిషా నిషా॥

వేసే చుక్కయితే ఎందాక వుంటుంది
తెలతెలవారగానే దిగిపోతుంది
చక్కని చుక్కయితే, చల్లని తిమ్మిరి
నీలో కలకాలం నెలకొంటుంది

అది బొటాబొటి సుఖం
ఇది సరాసరి స్వర్గం
పానీయం కావాలా ?
పడుచుపిల్ల కావాలా ?   ॥అరె నిషా నిషా॥

చిక్కని మైకాలు చిందులు వేయించి
చేయరాని పనులెన్నో చేయిస్తాయి
కమ్మని పిల్లయితే, కన్నులకు విందుగా
కవితలు నీచేత పలికిస్తుంది

అది ముఖాముఖి సరసం
ఇది ఏకాఏకి మధురం
మత్తుమందు కావాలా
మగువపొందు కావాలా   ॥అరె నిషా నిషా॥

శీను – గోపి

రచన : సి. నారాయణరెడ్డి

పాడినవారు : ఘంటసాల,
బాలసుబ్రహ్మణ్యం

సీను : ఎన్నాళ్ళో వేచిన ఉదయం
ఈనాడే ఎదురౌతుంటే

గోపి : ఇన్నినాళ్ళు దాచిన హృదయం
ఎగిసి ఎగిసి పోతూంటే

సీను : ఇంకా తెలవారదేమి ?
ఈ చీకటి విడిపోదేమి ?

సీను : మంచిని పెంచిన మనిషిని – ఏ
వంచన ఏమీ చేయదని
నీతికి నిలబడు వానికి – ఏ
నాటికి ఓటమిలేదని
నే చదివిన జీవితపాఠం –
నీకే నేర్పాలనివస్తే – ॥ఇంకా తెలవారదేమి॥

గోపి : నాగులుతిరిగే కోనలో – ఏ
న్యాయం పనికిరాదని –
కత్తిని విసిరే వానిని – ఆ
కత్తిలోనే గెలవాలని –
నేనెరిగిన చేదు నిజం –
నీతో చెప్పాలనివస్తే ॥ఇంకా తెలవారదేమి॥

తారాగణం:

కృష్ణ, శోభన్‌బాబు, నాగభూషణం, చలం, త్యాగరాజు,

జగ్గారావు, P. J. శర్మ, O. S. R ఆంజనేయులు,

రామచంద్రరావు, మోతుకూరి సత్యం,

మాస్టర్ విశ్వేశ్వరరావు.

విజయనిర్మల, గీతాంజలి, బృందావన చౌదరి, నబీనలక్ష్మి,

నర్తకి — జయకుమారి.

సాంకేతిక నిపుణులు :

మాటలు	:	భమిడిపాటి రాధాకృష్ణ.
పాటలు	:	ఆరుద్ర, దాశరథి, సి. నారాయణరెడ్డి.
సంగీతం	:	S. P. కోదండపాణి.
నేపథ్యం	:	సుశీల, బాలసుబ్రహ్మణ్యం, ఘంటసాల.
ఛాయాగ్రహణం	:	S. వెంకటరత్నం, W. I. C. A.
ఆపరేటివ్ కెమెరామన్	:	A. R. K. మూర్తి.
సహకార దర్శకుడు	:	K. V. రావు.
రికార్డింగ్ & రీరికార్డింగ్	:	వి. శివరామ్ B. A., B. Sc., హరనాథ్.
మేకప్	:	పోతరాజు, భద్రయ్య, మాధవరావు, రాజశేఖర్
నృత్యం	:	శ్రీనివాస్.
కళ	:	S. కృష్ణారావు.
కూర్పు	:	P. శ్రీహరిరావు A. F. E.
దుస్తులు	:	సూర్యారావు, రామారావు.
స్టిల్స్	:	M. సత్యం (జైహింద్ స్టూడియోస్)
పబ్లిసిటీ	:	గంగాధర్.
ప్రెస్ రిలేషన్స్	:	పిక్ న్యూస్.
ప్రెస్ పబ్లిసిటీ	:	N. V. K. R.
స్టూడియో	:	వాహిని.
లేబొరేటరీ	:	విజయ.
డిస్ట్రిబ్యూటర్స్	:	నవయుగ ఫిలింస్,
నిర్మాత	:	పి. మల్లిఖార్జునరావు.
దర్శకుడు	:	తాతినేని రామారావు.

పాటల పుస్తకం వెల : 15 పైసలు.

స్వతంత్రఆర్టు ప్రింటర్సు, విజయవాడ-4.



మధు పిక్చర్స్

మంచి మిత్రులు

నిర్మాత: పి. మల్లికార్జునరావు దర్శకుడు: టి. రామారావు